క్లుప్తంగా

కేటీఆర్ జన్మదిన వేడుకలు



సాక్షి నెట్‌వర్క్:బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మది న వేడుకలు బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కేకులు కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఆలయాల్లో కేటీఆర్ పేరుపై ప్రత్యేక పూజలు జరిపించారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హైదరాబాద్‌లో కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

మున్సిపల్‌కు 11 మంది ఉద్యోగుల రాక

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయానికి 11మంది ఉద్యోగులు బుధవారం బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. ఆర్వో ఉమా దేవి, సానిటరి ఎస్సై గజానంద్, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్‌లు, 8 మంది బిల్‌కలెక్టర్‌లు మున్సిపల్ కమిషనర్ రాజును కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

పేదల సంక్షేమాన్ని బీజేపీ విస్మరించింది



బోధన్: బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు నిరసనగా బుధవారం ఆర్డీవో ఆఫీసు ఎదుట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు, సభ్యులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యేశాల గంగాధర్ మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ ధనిక వర్గాలకు అనుకూలంగా ఉందని ఆరోపించారు. పేద ప్రజల సంక్షేమానికి బీజేపీ విస్మరించిందని విమర్శించారు.

రిజర్వేషన్ కల్పించాలి

పెర్కిట్(ఆర్మూర్): బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మందాపురం సుభాష్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమగ్ర కుల గణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ శాఖ అతిథి గృహంలో గురువారం నిర్వహించే సమావేశానికి బీసీలందరు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఆస్పత్రుల తనిఖీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రి, అర్బన్ హెల్త్‌సెంటర్, బస్తీ దవాఖానాను సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజు తనిఖీ చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు వస్తున్న సందర్భంగా ఆస్పత్రులలో సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయా లేవా అని పరిశీలించారు. అలాగే ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ రవికుమార్, వైద్యులతో సమావేశం నిర్వహించి సేవల గురించి అడిగి తెలసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సానిటరీ ఎస్సై గజానంద్, ఇంజినీర్ పూర్ణమాళి పాల్గొన్నారు

గ్రామదేవతల వద్ద హలాల్ నిషేధం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని అన్ని గ్రామ దేవతల వద్ద ఇకపై హలాల్ నిషేధిస్తున్నామని ఆర్మూర్ సర్వ సమాజ్ ప్రజా ఐక్య సమితి అధ్యక్ష, కార్యవర్గం తీర్మానిస్తూ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు ఆకుల రాజు మాట్లాడుతూ.. గ్రామ దేవతల అమ్మవారి సమక్షంలో హలాల్ పద్ధతిలో చేస్తే అది ఎంగిల వుతుందని అటువంటి మొక్కులు అమ్మవారికి చెందవన్నారు. గ్రామ దేవతల ఆలయాల వద్ద బోర్డులు ఏర్పాట్లు చేయాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. కార్యదర్శి కర్తన్ దినేష్, కోశాధికారి లింగంపల్లి శివ కృష్ణ, ఉపాధ్యక్షులు వైద్య రవీందర్, సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

కమ్మర్‌పల్లి: హాసాకొత్తూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండి దశరథ్ అనారోగ్యం బారిన పడి బుధవారం మృతి చెందారు. దీంతో కాంగ్రెస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో దశరథ్ అంత్యక్రియల కోసం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అదే విధంగా గ్రామపంచాయతీ తరపున రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రేవతి గంగాధర్ తదితరులున్నారు.

ఎల్‌వోసీ అందజేత

భీమ్‌గల్: చేంగల్ గ్రామానికి చెందిన సాయన్న కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. ఆపరేషన్ నిమిత్తం ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కు తెలిపారు. ఆయన స్పందించి సీఎం సహాయ నిధి నుంచి రూ.80 వేల ఎల్‌వోసీని ఇప్పించాడు. బుధవారం కాంగ్రెస్ కార్యకర్తలు ఎల్‌వోసీని కటుంబ సభ్యలకు అందజేశారు. ఆపద సమయంలో ఆదుకున్న ముత్యాల సునీల్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం

- మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు స్పందన



పట్టణ కేంద్రంలో పారిశుధ్య పనులు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దుతామని భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ అన్నారు. పట్టణంలో నెలకొన్న సమస్యలపై బుధవారం సాక్షి ఫోన్ ఇన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలు తెలియపరిచిన ప్రతి సమస్యను ఓపికతో మున్సిపల్ కమిషనర్ నోట్ చేసుకున్నారు. సమస్యలను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు.

– భీమ్‌గల్

సాక్షి ఫోన్ ఇన్

ప్రశ్న: పట్టణంలో ఎనిమిదవ వార్డులో చాకలి ఐలమ్మ విగ్రహ ప్రాంతంలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. దుర్గంధం వ్యాపిస్తోంది.

– ప్రవళిక, ఎనిమిదవ వార్డు

కమిషనర్: మా సిబ్బందితో మురుగు కాలువలను శుభ్రం చేయిస్తాం. మురుగు కాలువలో ఆయిల్ బాల్స్ వేసి దోమల నివారణకు చర్యలు చేపడతాం.

■ సరస్వతి విద్యామందిర్ స్కూల్ ప్రాంతంలో డ్రైనేజి వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచి చెరువును తలపిస్తోంది.

– ప్రశాంత్, రెండో వార్డు

■ సమస్యను గుర్తించి చర్యలు చేపడతాం. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచి నీరు నిలువకుండా చర్యలు చేపడతాము

■ నందిని పబ్లిక్ స్కూల్ నుంచి బడా భీమ్‌గల్ వెళ్లే దారిలో వీధి దీపాలు వెలగడం లేదు

– ప్రదీప్, మూడో వార్డు

■ కాంట్రాక్టర్‌లకు సమాచారం అందించాం. మరమ్మతులు చేయించి విద్యుత్ దీపాలు వెలిగేలా చేస్తాం.

■ రాజారాంనగర్ కాలనీలో పారిశుధ్య నిర్వహణ సరిగా లేదు. దోమల బెడద ఎక్కువగా ఉంది.

– అనిరుధ్, రాజారాంనగర్‌కాలనీ

■ పారిశుధ్య పనులు చేయిస్తాం. బ్లీచింగ్ చేస్తున్నాం. నిలువ నీటిలో ఆయిల్ బాల్స్ వేసి దోమలను నివారిస్తాం.

■ ఒకటవ వార్డులో ఖాళీ ప్రదేశాల్లో చెట్లు, పొదలు పెరిగాయి. నీరు నిలువ ఉంటుంది. తేళ్లు, పాములు వస్తాయనే ఆందోళన ఉంది.

– శ్రావణ్, ఒకటో వార్డు

■ ఓపెన్ ప్లాట్ల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. పిచ్చి మొక్కలు తొలగించేలా, నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపడతాం.

■ మూడవ వార్డులోని నంది గుడి ప్రాంతంలో పందుల బెడద ఎక్కువగా ఉంది. ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నాం.

– గంగాధర్, మూడవ వార్డు

■ పందుల నివారణకు వాటి యజమానులతో మాట్లాడి తొలగించేలా చర్యలు చేపతాం.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు పంచరెడ్డి ప్రవళిక

మాక్లూర్: త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుండే సిద్ధం కావాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు పంచరెడ్డి ప్రవళిక, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం అడవి మామిడిపల్లి శివారులోని వంజరి సంఘ భవనంలో మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ మండల కార్యవర్గ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోనికి వచ్చినప్పటికి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ వట్టి బూటకమన్నారు. పావు వంతు రైతులకు కూడా రుణమాఫీ వర్తించటం లేదన్నారు. ఇదే అవకాశంగా ప్రజల్లోనికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ విధివిధానాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గంగోనే సంతోష్, ఓబీసీ మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జి గంగోనే వినోద్, సీనియర్ నాయకులు గోవూరు ఒడ్డెన్న, బడుగు సత్యం, మండల ప్రధాన కార్యదర్శి చింత ప్రవీణ్, నాయకులు ఎం రాజు, ముప్ప గంగారెడ్డి పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న బీజేపీ నేత మల్కన్నగారి మోహన్

వేల్పూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ బాల్కొండ నియోజకవర్గ కన్వీనర్ మల్కన్నగారి మోహన్ అన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారంపెల్లి గంగాధర్ మాట్లాడారు. రాజకీయ, వ్యవసాయ తీర్మానాలను ప్రవేశపెట్టారు. సమావేశంలో వేల్పూర్, డొంకేశ్వర్ మండలాల బీజేపీ అధ్యక్షులు సురేందర్, ఏలేటి రమేశ్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్‌ను సాధిస్తాం

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి



హాసాకొత్తూర్‌లో పీఆర్‌టీయూ సభ్యత్వాన్ని అందజేస్తున్న మోహన్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌ను త్వరలోనే సాధిస్తామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి, ఉప్లూర్, హాసాకొత్తూర్, చౌట్‌పల్లి, బషీరాబాద్, కోనసముందర్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు హెచ్ఎం పోస్టు మంజూరు చేయించడంతో పాటు, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇప్పిస్తామన్నారు. సీపీఎస్ రద్దు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో పాటు, 317 జీ.వో బాధితులను సొంత జిల్లాలకు తీసుకొస్తామని హామీనిచ్చారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొద్దుటూరి చంద్రశేఖర్, అంజాద్ సుల్తాన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజేశ్వర్ గౌడ్, నాగభూషణం, మండల కార్యదర్శి రోహిత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస మూర్తి, రాధాకిషన్, మండల విద్యాధికారి ఆంధ్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న కమలాకర్

రెంజల్(బోధన్): పీఆర్‌టీయూతోనే ఉపాధ్యాయ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్ రావు పేర్కొన్నారు. సంఘం సభ్యత్వ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం నీలా హైస్కూల్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిలిచిపోయిన డీఏలను రానున్న రోజుల్లో ముఖ్యమంత్రితో మాట్లాడి విడుదల చేయిస్తామని భరోసా ఇచ్చారు. ఉపాధ్యాయుల సేవలో సంఘం ముందుంటుందని, సంఘటితంగా పీఆర్టీయూకు అండగా నిలవాలని సూచించారు. అనంతరం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇల్తెపు శంకర్ మాట్లాడారు. మండల అధ్యక్షుడు సోమలింగంగౌడ్, ఎంఈవో గణేశ్‌రావ్, నోడల్ అధికారి ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి సాయరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నర్సింహారెడ్డి, కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'పసుపు రైతులను బీజేపీ మోసం చేసింది'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కమ్మర్‌పల్లి: ఎన్నికల సమయంలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మరోసారి తెలంగాణ పసుపు రైతులను ముఖ్యంగా నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని పసుపు రైతులను బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందని కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్‌రెడ్డి మాట్లాడారు. సాక్షాత్తు పీఎం నరేంద్ర మోదీ ఎన్నికల సమయంలో మహబూబ్‌నగర్, నిజామాబాద్ ఎన్నికల సభలో ప్రకటన చేశారని గుర్తు చేశారు. తెలంగాణ నుంచి ఇద్దరు మంత్రులు ఆరుగురు ఎంపీలు ఉన్నా గాని తెలంగాణ రైతుల్ని ఆదుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. నేతలు భాస్కర్, సింగిరెడ్డి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌డీఎస్ కౌన్సిల్ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్

బోధన్: అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏఐఎఫ్‌డీఎస్) జాతీయ జనరల్ బాడీ సమావేశాలు ఆగస్టు 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లోని ఓం కార్ భవన్‌లో జరుగనున్నాయి. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం కౌన్సిల్ కరపత్రాలను కళాశాల ప్రిన్సిపల్ నిక్కత్ కౌసర్, సీనియర్ అధ్యాపకుడు శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కన్వీనర్ ఎండీ మోసిన్ మాట్లాడారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం మౌనం వీడి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డివిజన్ కన్వీనర్ కల్యాణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

■ లక్ష్మీ గణపతి ఆలయంలో కుంకుమార్చన



రుద్రూర్: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో సంకట హర చతుర్థి పురస్కరించుకుని బుధవారం కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

■ వైభవంగా బోనాలు



ఎడపల్లి(బోధన్): బాపునగర్‌లో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో రంజిత్, రాము, రాజ్ కుమార్ స్వామి, కిషోర్, నర్సింలు, శేఖర్, గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

■ పోచమ్మ పండుగ



కమ్మర్‌పల్లి: హాసాకొత్తూర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఐదు చేతుల పోచమ్మ, మహాలక్ష్మి దేవతల పండుగలను ఘనంగా నిర్వహించారు. గంగపుత్ర సంఘం సభ్యులు వలగొడుగును ప్రదర్శిస్తూ ర్యాలీగా వెళ్లి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వీడీసీ అధ్యక్షుడు కొమ్ముల రజనీకాంత్, కార్యదర్శి కుందారం శ్రావణ్, ఉపాధ్యక్షుడు చిన్న బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈత వనం పెంపకానికి భూమి కేటాయించాలి

రుద్రూర్: గీత కార్మికుల జీవనోపాధి కోసం ఈత వనం పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం పది ఎకరాల భూమిని కేటాయించాలని తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.విఠల్ గౌడ్ కోరారు. కోటగిరి మండలం లింగాపూర్ చెరువు కట్ట వద్ద బుధవారం వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గీత కార్మికులు తాటి, ఈత, కర్జూర మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకాగౌడ్, శ్రీధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కౌమార దశలో వచ్చే మార్పులపై అవగాహన

బోధన్‌రూరల్: పెగడాపల్లి, పెంటాకలాన్ గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో వర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కౌమార దశలో వచ్చే మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం ఆయా పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులతో సమావేశం నిర్వహించి వర్డ్ స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ కూర చంద్రశేఖర్ మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత, రక్త హీనత, హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించుకొని జీవన శైలిలో జాగ్రత్తలు పాటించాలన్నారు. హెచ్ఎంలు మంగళ, అబ్బయ్య, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

హెడ్ రెగ్యులేటర్ పరిశీలన



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరద కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి బుధవారం పరిశీలిచారు. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో వరద కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్దకు ప్రాజెక్ట్ నీరు రావడంతో హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. డిప్యూటీ ఈఈ గణేష్, ఏఈఈ రామారావు ఉన్నారు.

సంక్షిప్తం

దంప్ చేసిన ఇసుక వేలం

రుద్రూర్: పోతంగల్ మండల శివారులోని వీరభద్ర మందిరం సమీపంలో ఉన్న ఇసుక డంప్‌ను తహసీల్దార్ మల్లేష్ సమక్షంలో బుధవారం రెవెన్యూ అధికారులు వేలం నిర్వహించారు. పోతంగల్ తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటకు పలువురు ఔత్సాహికులు హాజరయ్యారు. అత్యధికంగా రూ.26 వేలకు గంగాధర్ అనే వ్యక్తి ఇసుక డంప్‌ను దక్కించుకున్నారు.

బాధ్యతల స్వీకరణ

బోధన్‌రూరల్: బోధన్ డీఎల్‌పీవోగా మధుకర్ అదనపు బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని డీఎల్‌పీవో కార్యాలయంలో ఎంపీవో మధుకర్ డీఎల్‌పీవోగా (ఎఫ్ఏసీ) బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియచేశారు.

నవీపేటలో సూపరింటెండెంట్..

నవీపేట: మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా బదిలీపై వచ్చిన సునీతాదేవి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. నవీపేటలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన శ్రీనివాస్‌రావ్ జెడ్పీకి బదిలీ కాగా అక్కడి నుంచి నవీపేటకు సునీతాదేవి బదిలీపై వచ్చారు.

ఇద్దరు బాలకార్మికులకు విముక్తి

బోధన్: ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా బుధవారం సాలూరలో పలు దుకాణాలను అధికారులు తనిఖీ చేశారు. పనిచేస్తున్న ఇద్దరు బాలకార్మి కులను గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్ట విరుద్ధమని ముస్కాన్ టీం సభ్యులు తెలిపారు.

మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

ఎడపల్లి(బోధన్): ఏఆర్పీ క్యాంప్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం మాదక ద్రవ్యాల వాడకంతో వచ్చే అనర్థాల గురించి విద్యార్థులకు ఎడపల్లి పోలీసులు అవగాహన కల్పించారు. ప్రతి ఒక విద్యార్థి మంచి లక్ష్యం వైపు ప్రయాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎడపల్లి పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ భీమ్‌రావు, ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చందశేఖర్ మరణం తీరని లోటు

భీమ్‌గల్: సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా జాతీయ నాయకుడు చంద్రశేఖర్ ఇటీవల మరణించారు. బుధవారం మండల కమిటీ ఆధ్వర్యంలో భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ డివిజన్ నాయకుడు రాజేశ్వర్ మాట్లాడుతూ.. చంద్రశేఖర్ అకాల మరణం వారి కుటుంబానికి తీరని లోటని అన్నారు. నాయకులు నర్సయ్య, అరవింద్, తదితరులున్నారు.

ఆర్టీసీని ఆదరించండి



ఉత్తమ డ్రైవర్‌ను సన్మానిస్తున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఎంవీఐ, డీఎం

బోధన్: సుశిక్షితులైన డ్రైవర్లున్న ఆర్టీసీని ప్రజలు ఆదరించాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఎంవీఐ శ్రీనివాస్‌లు ప్రజలకు సూచించారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఈ నెల 30 వరకు ప్రమాదరహిత వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా డిపోలో నిర్వహించిన తొలి రోజు వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏసీపీ, ఎంవీఐ ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్తమ డ్రైవర్లకు నగదు ప్రోత్సాహకం అందించి సన్మానించారు. డీఎం శ్రీనివాస్, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం

ఆర్మూర్‌టౌన్: ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితమని ఎంవీఐ వివేకానందరెడ్డి అన్నారు. ఆర్మూర్ ఆర్టీసీ డిపోలో బుధవారం ప్రమాదరహిత వారోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ డ్రైవర్లకు, సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లను సత్కరించారు. డీఎం రవి కుమార్, ఎంఎఫ్ గంగాకిషన్, ఎస్టీఐ పారు, డీవీఎస్ చక్రవర్తి పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి

మాక్లూర్: అణగారిన కులాలు రాజ్యాధికారం సాధించుకున్నప్పుడే ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధి జరుగుతుందని ధర్మ సమాజ్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు ప్రేమ్ కుమార్ అన్నారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ అణగారిన జాతుల అభివృద్ధి కోసం 10 వేల కిలోమీటర్లు పాదయాత్ర ప్రారంభించి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం గుత్ప గ్రామంలో శిలాఫలకం ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. పాదయాత్రను స్మరించుకున్నారు. గ్రామ అధ్యక్షుడు అన్వేష్, కె గంగాధర్, తదితరులున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని వినతి



బాల్కొండ: మండల కేంద్రంలో గ్రామానికి విద్యుత్ సరఫరా చేస్తున్న 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 60 కేవీ, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌కు బుధవారం వీడీసీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తక్కువ కేవీ విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్లు ఉండటం వల్ల లోవోల్టేజీతో సమస్యలు వస్తున్నాయన్నారు. తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ట్విస్టర్ (హిందీ) – 11.50, 6.40, 9.30 భారతీయుడు-2 (తెలుగు) – 02.45
స్క్రీన్-2 –	కల్కి – 2898 ఏడి (3డీ-తెలుగు) – 11.00, 2.45, 6.30, 10.15
స్క్రీన్-3 –	డార్లింగ్ (తెలుగు) – 11.45, 3.05, 6.25, 9.45
స్క్రీన్-4 –	ది బర్త్‌డే బాయ్ (తెలుగు) – 02.20, క్రైమ్ రీల్ (తెలుగు) – 5.00 పేకమేడలు (తెలుగు) – 7.35 భారతీయుడు-2 (తెలుగు) – 10.15